గృహాల నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి- జీ.కే.వీధి: మండలంలోని లక్కవరపేట పంచాయతీ బోయపాలెం గ్రామంలో 90 గృహాల నిర్మాణాలకు మండల హౌసింగ్ అధికారి సెగ్గే సూరిబాబు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్, ఎంపీపీ బోయిని కుమారి, ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు, ఎంపీ టీసీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ గంగాధర్, ఈవోపీఆర్డి పాపారావు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న హౌసింగ్ అధికారి

బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్‌కు అంతరాయం

- అవస్థలు పడుతున్న వినియోగదారులు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ కు తరచుగా అంతరాయం ఏర్పడుతుండడంతో వినియోగదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ప్రస్తుతం గత కొద్ది రోజుల నుంచి నిమిషం సిగ్నల్ ఉంటే మరో నిమిషం సిగ్నల్ కట్ అవుతుంది. బిఎస్ఎన్ఎల్ నెట్ సౌకర్యం లేక పోవడంతో ఆన్లైన్ కేంద్రాల నిర్వహకులు, వ్యాపారాలు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏజెన్సీ ప్రాంతంలో బిఎస్ఎన్ఎల్ ,జియో, ఎయిర్టెల్ సౌకర్యాలు ఉన్నప్పటికీ మొదటి నుంచి అధిక శాతం మంది బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉన్నారు. ప్రస్తుతం గత వారం రోజుల నుంచి తరచుగా సిగ్నల్ ఉంటూ మధ్యలో అంతరాయం పడుతుంది. దీంతో వినియోగదారులు అసౌకర్యాన్నికి గురవుతున్నారు. ఫోన్ సిగ్నల్ తో పాటు ఇంటర్నెట్ సిగ్నల్ కూడా సక్రమంగా ఉండకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. గతంలో ఒకటి రెండు రోజులు పూర్తిగా అంతరాయం ఏర్పడిన ఆ తర్వాత మరమ్మత్తు చేసి పునరుద్ధరించిన తర్వాత ఇబ్బందులు ఉండేవి కావు. గత కొద్ది రోజులుగా సిగ్నల్ కట్ అవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు అంటున్నారు. సంబంధిత బిఎస్ఎన్ఎల్ అధికారులకు ఫిర్యాదు చేసిన వెంటనే మరమ్మతు చేసి సిగ్నల్ పునరుద్ధరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండలంలోని పలు వురు వినియోగ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బిఎస్ఎన్ఎల్ సిగ్నల్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

శిథిలమైన అతిథి గృహం

శిథిలావస్థలో రూథర్‌ఫర్డ్ అతిథి గృహం

ప్రజాశక్తి చింతపల్లి: లంబసింగి-కొర్రుబయలు గ్రామాల మధ్యలో బ్రిటిష్ కాలంలో నిర్మితమైన రూథర్ ఫర్డ్ అతిథి గృహం భవనం శిథిలావస్థకు చేరింది. ప్రత్యేకత కలిగిన లంబసింగి-తాజంగి ప్రాంతంలో తాజాగా స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం ఏర్పాటయ్యింది. చింతపల్లి-తాజంగి మీదుగా పాడేరు వెళ్లే మార్గం జాతీయ రహదారిగా అభివృద్ధి చెందుతున్న వేళ, ఈ ప్రాంతం పర్యాటక పటములో మరో ప్రధాన కేంద్రమవుతుంది. ఈ నేపథ్యంలో రూథర్ ఫర్డ్ గెస్ట్ హౌస్‌ను పునరుద్ధరించి విద్యార్థులు, పర్యాటకుల పరిశీలనకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. బ్రిటిష్ పాలనలో చోటు చేసుకున్న చారిత్రక సంఘటనలను ప్రతిబింబించే శిలాఫలకాలు, విగ్రహాలతో తీర్చిదిద్దితే, అది విద్యార్థులకు చారిత్రక అవగాహన కల్పించే ప్రత్యేక వేదికగా మారుతుందని పలువురు తెలిపారు. ప్రతి ఏటా స్థానికులు స్వచ్ఛందంగా ఈ గెస్ట్ హౌస్ పరిసరాలను శుభ్రం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ అధికారిక చర్యలు కానరాలేదు. ఇటీవల గెస్ట్ హౌస్‌కు దారి చూపే బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో, స్థానికులు కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ చారిత్రక గెస్ట్ హౌస్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటే, లంబసింగికి వన్నెతెస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ వేదికగా యోగా సాధనకు తరలిరండి

- కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: యోగ సాధనతోనే యోగాంధ్ర సాధ్యమని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 12న పాఠశాలలు పున్న ప్రారంభం కానున్నాయని, ఆ రోజు నుండే విద్యార్థులతో యోగ సాధన చేయించాలని సూచించారు. ఈ నెల 21న విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో ప్రధానమంత్రి సమక్షంలో జరుగనున్న యోగా డే లో 25 వేల మంది గిరిజన విద్యార్థులతో 108 సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధనకు కసరత్తు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల యోగాకు ఆంధ్ర విశ్వ విద్యాలయం గ్రౌండ్ కేటాయించినట్లు, దానికి వాటర్ ప్రూఫ్ టెంట్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీచ్ రోడ్ లో విశాఖ పట్నం నుండి భీమిలి వరకు ఐదు లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహించడానికి విశాఖపట్నం జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. యోగాంధ్రలో భాగంగా జిల్లాలో 19 మంది యోగ గురువులుగా నమోదయ్యారని, 112మంది యోగా మాస్టర్ ట్రైనీలుగా. 3,367 మంది ట్రైనర్లుగా నమోదయ్యారని కలెక్టర్ తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు ట్రైనర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు నమోదయిన 3,49,141 మంది ప్రజలకు శిక్షణ ఇచ్చి యోగ సాధన చేయిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 2,684 కేంద్రాలను యోగ సాధనకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. గ్రామ స్థాయి యోగ పోటీలు పూర్తయ్యాయని, మండల స్థాయి యోగా పోటీలు రేపటితో పూర్తవుతాయని పేర్కొన్నారు. మండల స్థాయి పోటీలలో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ, జిల్లా యోగా నోడల్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు, గిరిజన సంక్షేమ డిడి ఎల్. రజని, డిఎస్పి షేక్ సహబాజ్ అహమ్మద్, డిఇఒ పి.బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- పెదబయలు :మండల కేంద్రంలో తహసీల్దార్ జి రంగారావు, ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్య, విస్తరణ అధికారి నరసింహం పోలీసు అధికారులు మెయిన్ రోడ్డు విస్తరణకు రంగం సిద్ధం చేసారు. పెట్రోల్ బంక్ సమీపంలో గిరిజనునికి చెందిన వెదురు షెడ్డును తొలగించారు. దీంతో వ్యాపారులు తొలగింపు పనులను అడ్డుకున్నారు. ఆర్ అండ్ బి అధికారిని ఎస్ శ్రీదేవి విలేకరులు అడిగిన ప్రశ్నకు మాట్లాడుతూ,తాను కొత్త గా వచ్చానని, రోడ్డు వెడల్పు విషయం తనకు తెలీదన్నారు. తహసీల్దార్ రంగారావు కలుగ జేసుకొని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అక్రమంగా ప్రభుత్వ స్థలం ఆక్రమించుకొని ఎవరైతే నిర్మాణాలు చేశారో వారికీ అక్రమ కట్టడాలు తొలగించాలని సెక్షన్ 7,6 పేరిట నోటీసులు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మాధవరావు, సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తొలగిస్తున్న పోలీసులు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంఇఒ తదితరులు

శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం తో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో మండలంలోని టోకూరు పంచాయతీ ములియగుడలో శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ప్రారంభించారు. శారద నికేతన్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ వేంగడ తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభానికి ముఖ్య అతిథులుగా స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణి, మండల విద్యాశాఖ అధికారి బాలాజీలు హాజరై రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు దీటుగా ఇంగ్లీష్ మీడియం విద్యను అందించాలనే లక్ష్యంతో శారద ట్రస్ట్ ముందుకు వచ్చిందన్నారు. నాణ్యమైన విద్యను పొందాలంటే విద్యార్థిని విద్యార్థులు మైదాన ప్రాంతానికి వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. మండలంలో ఉద్యోగరీత్యా స్థిరపడిన వారి పిల్లలు కూడా విద్యకు దూరమయ్యే వారని, పాఠశాల స్థాపించడంతో ఉద్యోగస్తుల పిల్లలు కూడా చదువుకునే అవకాశం కలుగుతుందని వారు అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థిని తల్లిదండ్రులు సద్వినియోగం పరుచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌వి వరహాల రెడ్డి, స్థానిక ఎంపీటీసీ రత్నకుమారి, సర్పంచ్ కిల్లో మోస్య, ఉప సర్పంచ్ జీ .నర్సన్న సారద నికేతన్ పాఠశాల అడ్వైజర్ బి రోజా కిరణ్, ట్రస్టు సభ్యులు సుమిత్ర, అరుణ, వి ఉమామహేశ్వరరావు, దామోదర్, చిన్నం నాయుడు, కామేశ్వరరావు, ప్రిన్సిపల్‌లు చిరంజీవి, రాజు. తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు:కడప వై.ఎస్.ఆర్. క్రీడా పాఠశాలలో 4, 5 తరగతులలో 2025-26వ విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు జిల్లా క్రీడాధికారి ఎ.జగన్ మోహన్ రావు శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. జనన ధృవీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుందని, వాస్తవ పుట్టిన తేదీ నుండి ఒక సంవత్సరం లోపు సర్టిఫికెట్ జారీ అయినవారు మాత్రమే అర్హులని తెలిపారు. ధరఖాస్తుదారుడి ఒరిజినల్ డాక్యుమెంట్లు, వైద్య పరీక్షలలో సంతృప్తి చెందిన తరువాత మాత్రమే జిల్లా స్థాయి ఎంపిక పరీక్షలలో పాల్గొనడానికి అర్హులన్నారు. జిల్లా స్థాయి లో ప్రతిభ కనపరచిన అభ్యర్థులను మెరిట్ ప్రాతిపదికన గుర్తించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయబడతారని తెలిపారు.

రహదారులపై పశువులతో ప్రమాదాలు

జాతీయ రహదారిపై ఉన్న పశువులు

ప్రమాదంలో మృతి చెందిన పశువులు

ప్రజాశక్తి - రంపచోడవరం : జాతీయ రహదారిపై పశువుల సంచారం ఎక్కువవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రంపచోడవరం పోలీసుస్టేషన్, ఐ.పోలవరం జంక్షన్ ఇలా ప్రతీ గ్రామంలో పశువుల సంచారం ఎక్కువగా ఉందని జాతీయ రహదారి పొడవున తరుచూ ఎక్కడో ఒకచోట పశువులు అడ్డం వచ్చి ప్రమాదాలు సంభావిస్తూనే ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులతో పాటు పశువులు కూడా ప్రమాదాల బారిన పడి చనిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో రాత్రి సుమారు 10 గంటల సమయంలో రంపచోడవరం మండలం బి.వి.కోట సమీపంలో సచివాలయం ఎదురుగా రోడ్డుపై నిద్రిస్తున్న ఆవులపై నుండి ఒక గుర్తు తెలియని వాహనం దూసుకు వెళ్లడంతో ఆరు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఏజెన్సీ ప్రాంతంలో ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగ అనంతరం ఇక్కడి గిరిజనులు తమ పశువులను కట్టకుండా విడిచిపెట్టి మళ్లీ తొలకరి వచ్చి నారు వేసే వరకు వాటిని పట్టించుకోరు. ఈ కారణంగా ప్రతీ గ్రామంలోని పశువులు సమీపంలో భూముల్లో మేత తిని సాయంత్రం సమయంలో రోడ్లపై సేదతీరుతుంటాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పశువులను గోశాలలకు తరలించాలని కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి

రంపచోడవరంలోని ఐ.పోలవరం, జాగరంపల్లి, పోలీసుస్టేషన్, అంబేద్కర్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో పగలు, రాత్రి సమయాల్లో ఆవులు, గేదెలు రోడ్లపై పడుకుంటున్నాయి. వాటిని తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీ కొనడం లేదా రాత్రి సమయంలో అవి కనపడక ప్రమాదాలకు గురి కావడం జరుగుతోందని, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా జరిగాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కశింకోట వీరవెంకట సత్యనారాయణ , వాహన దారుడు

పిఒ చెప్పినా అధికారులు చర్యలు తీసుకోలేదు

రంపచోడవరం నుండి రాజవొమ్మంగి వరకూ జాతీయ రహదారి 516 ఈ పై ఎదో ఒకచోట నిత్యం పశువులను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే విషయం గత నెలలో రంపచోడవరం ఐటిడిఎ పిఒకు తెలిపాం. ఆయన స్పందించి పంచాయితీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

- లోతా రామారావు,
ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ రైతుభరోసా కేంద్రంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశామని సర్పంచ్ ఎన్.రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పంచాయతి పరిధిలో 50 మంది రైతులకు వ్యవసాయాధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో వరి విత్తనాలు పంపిణీ చేశామని తెలిపారు. ముందస్తుగానే ప్రభుత్వం వరి విత్తనాలను రైతులకి సరఫరా చేసిందని దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియం చేసుకోవాలని ఎఒ శ్రీదేవి సూచించారు. వర్షాలు పడుతున్నందున ముందుగా నారుమడులు సిద్ధం చేసుకుని విత్తనాలు వేసుకోవాలని సూచించారు. వరి నారుపోసేటప్పుడు విత్తనశుద్ధి చేస్తే దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాడి రామన్న, కూటమి నాయకులు స్వాభా జగన్, పోతురాజు గోవిందు, గిరిరైతులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజు

కుళాయిల వద్ద బ్లీచింగ్ చల్లిస్తున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - జికె.వీధి : మండలంలోని లక్కవరపేట పంచాయితీ బోయపాలెంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు సూచించారు. గ్రామంలో మురుగు కాల్వలు, కుళాయిల దగ్గర బ్లీచింగ్ చల్లించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చిన్నపాటి జ్వరం వచ్చినా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కంకిపాటి వీరేంద్ర ప్రసాద్, పెదవలస పిహెచ్‌సి వైద్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి పాపారావు, సచివాలయ సిబ్బంది రాము, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్యశిబిరం

ప్రజాశక్తి - రంపచోడవరం : రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల సిరిగిందలపాడు శాఖ వారిచే ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు స్వామి పరిజ్ఞేయానంద ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో గుండెకు సంబంధించిన వ్యాధులు, ఆయాసం, దడ, బిపి, షుగరు, చెవి, ముక్కు,గొంతు,ఎముకలు, కీళ్లు, ఫిట్స్, చర్మవ్యాధులతో పాటు స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, పిల్లల వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారు. పరమహంస యోగానంద నేత్రాలయ, వేమగిరివారిచే కంటి పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయడంతో పాటు కళ్ళజోళ్ళు అందిస్తారని ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు తీసుకుని రావాలని ఆయన కోరారు.

యోగాలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి- మారేడుమిల్లి: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మారేడుమిల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా వేడుకల్లో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస్, తహశీల్దార్ బాలాజీ ఆధ్వర్యంలో మండలస్థాయి యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని మానసిక ప్రశాంతత ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మారేడుమిల్లి మండలంలో అన్ని పంచాయతీల నుండి అర్హులైన వారిని ఎంపిక చేసి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు లలితకుమారి, ఉపాధ్యక్షులు, లక్కొండ రవికుమార్, సర్పంచ్ కొండ జాకబ్, జెడ్‌పిటిసి గొర్ల బాలాజీ, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు విస్తరణఅధికారి పి.శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు యోగ కన్వీనర్ ముత్యాలరావు, ఎంఇఒ, మెడికల్ ఆఫీసర్ ఆయుష్, సీనియర్ పిడి సుదర్శన్, నరసయ్య, డిఆర్‌పి దేవి, ఎమ్మార్పి శశికాంత్ పిడిలు, పిఇటిలు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

జిసిసి డిపో ద్వారా రేషన్ పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సహకార సంస్థ ద్వారా ప్రతినెల రేషన్ లబ్ధిదారులకు అందజేయడం హర్షణీయమని కూటమి నాయకులు కె.రామదాస్, కె.రాంబాబు. కె.నీలేంద్ర, సి.సత్యమూర్తి కొత్తూరు రాంబాబు మండల కార్యదర్శి ధర్మారావు పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ పంపేవారని అయితే కొన్నిచోట్ల రహదారి లేక రేషన్ సరుకులు పేదవారింటికి చేరేవే కావని వాపోయారు. జికె వీధి మండలం దారకొండ పంచాయతీ కమ్మరి తోటలో జిసిసి డిపో ద్వారా శుక్రవారం సేల్స్‌మెన్ నూకరత్నం నిత్యావసర సరుకులు తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు అందజేసారని తెలిపారు. రహదారి లేని గ్రామాలకు ఎప్పుడు రేషన్ అందజేస్తారో అని గిరిజనులు ఎదురుచూపులు చూసేవారని ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదన్నారు. నేరుగా జిసిసికే ఒకటో తేదీ నుంచి 15వ తేదీ లోపు ఎప్పుడైనా రేషన్ సరుకులు పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు

చెట్టు కొమ్మల తొలగింపు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దుప్పిలివాడ సమీప ప్రధాన రహదారిపై గాలి, వర్షానికి చెట్టుకొమ్మలు ప్రమాదవశాత్తూ విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారిపై ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రహదారి తనిఖీల్లో భాగంగా అదే మార్గంలో వస్తున్న సీలేరు పోలీసులు రహదారికి అడ్డంగా చెట్టు కొమ్మలు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు గుర్తించారు. వెంటనే స్పందించి ట్రైనింగ్ ఎస్సై బాబి, పోలీస్ ధనరాజు సంతోష్ చెట్టు కొమ్మలను తొలగించారు. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం తొలగింది. పలువురు అభినందించారు.

కుంటిరంగిని రోడ్డు బురదమయం

-రాకపోకలకు ప్రజలు, వాహనదారుల అవస్థలు

బురదమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని బస్కీ పంచాయితీ కుంటిరంగిని నుంచి డుంబ్రిగూడ గాంధ వెళ్ళే రహదారి బురదమయం కావడంతో ఈ మార్గంలో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారి గుండా సింధిపుటు, రంగినిగూడ, గాంధ, పూసేలి, మొర్రిగూడ గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. గుత్తేదారులు రోడ్డు పనులు మధ్యలోనే వదిలేయడంతో ప్రస్తుతం ఈ మధ్య కాలంలో కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు బురద మయంగా తయారైంది.దీంతో ఈ రోడ్డులో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉందని గిరిజన ప్రజలు ఆవేదన చెందుతున్నారు.అధికారులు వెంటనే స్పందించి ఈ రహదారి సమస్యను పరిష్కరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కాలువ మరమ్మతుకు రూ.30 లక్షలు మంజూరు

ప్రజాశక్తి -కోటవురట్ల: నీలిగుంట సమీపంలో 15వ కిలోమీటర్ల వద్ద దెబ్బతిన్న తాండవ కాలువ మరమ్మత్తు పనులకు 30 లక్షలు మంజూరు చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. బికేపల్లి 14వ సంఘం కాలువ చైర్మన్ వేచలపు భాస్కరరావుతో కలిసి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్యాం కుమార్, నీలుగుంట మాజీ సర్పంచ్ సత్తిబాబు పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ కే.శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు ముందుగా అడ్మిషన్లు పొందాలని చెప్పారు. కళాశాలలో పూర్తి స్థాయిలో అధ్యాపకులు, ఫర్నిచర్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దు

ప్రజాశక్తి -నక్కపల్లి: వ్యవసాయ సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని వ్యవసాయ శాస్త్రజ్ఞులు, అధికారులు రైతులకు సూచించారు. మండలంలో డొంకాడ, గొడిచర్ల, చీడిక గ్రామాల్లో శుక్రవారం వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమంలో భాగంగా బిసిటి-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో రైతులతో సమావేశం నిర్వహించారు.వాణిజ్య పంటల పరిశోధన సంస్థ,(రాజమండ్రి) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ, రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడడం ద్వారా భూమి భౌతిక, రసాయన, జీవ లక్షణాలు నాశనమవుతున్నాయని, నిర్దేశించిన మోతాదు మించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించి అందుకు అనుగుణంగా నిర్దేశించిన మోతాదులో మాత్రమే రసాయనాలు వినియోగించాలని సూచించారు. కూరగాయ పంటలలో విత్తనాల ఎంపిక, మార్కెట్ కు అనుగుణంగా సాగు చేసే విధానాలను వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ మామిడి, బొప్పాయి, కూరగాయ పంటలలో సమగ్ర యాజమాన్య చర్యలను పాటించాలన్నారు.

బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, తెగులు రాకుండా నివారించే పద్ధతులను వివరించారు. నవధాన్య పచ్చిరొట్ట ఎరువుల ప్రయోజనాలను తెలియజేశారు. వరిలో చౌడును తట్టుకునే రకాలను, చీడపీడలు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

డుంబ్రిగుడలో...

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:- వేసవి సెలవుల్లో విద్యార్థులకు నిర్వహించిన విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. స్థానిక శాఖ గ్రంథాలయ అధికారిని సునీత ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకల్లో ఉపాధ్యాయుడు సింహాద్రి, యూనియన్ బ్యాంకు క్యాషియర్ రమేష్ పాల్గొని చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. నెల రోజుల పాటు విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగింది. చిన్నారుల్లో విజ్ఞాన సామర్థ్యాలతో పాటు క్రీడలు, మానసిక ఎదుగుదలకు తోడ్పాటు నిచ్చిందని వారన్నారు. గ్రంథాలయ ఆఫీసు సబార్డినేట్ సుబ్బారావు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

విఆర్ పురం: కూనవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. లైబ్రేరియన్ మాదేటి గోవిందరాజులు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించబడింది. ముఖ్యఅతిథులుగా సచివాలయం ఉద్యోగిని తుష్టి సాయిలక్ష్మి, సర్వేయర్ అశోక్, రిటైర్డ్ హెచ్ఎం జి.వెంకటస్వామి, విజయసాధన హైస్కూల్ హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయురాలు జాహ్నవి, ఎ. వీర్రాజు (బుజ్జిబాబు), పూర్వపు పాఠకులు కష్ణార్జునరావ్, నోముల సత్యనారాయణ, సిహెచ్.సుబ్బారావు విద్యార్థులు హాజరయ్యారు. దీనిలో భాగంగా స్వర్ణాంధ్ర- 2047 వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో ప్రథమ బహుమతి సిహెచ్. హర్షిత్‌సాయి సచిన్, ద్వితీయ బహుమతి కె. యజ్ఞశ్రీ, టి.బోధన చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి టి.బోధన ద్వితీయ బహుమతి టి.రేవంత్ తృతీయ బహుమతి టి.లిఖిత జూనియర్స్ డి.సాహితి, ద్వితీయ బహుమతి బి.నికిల్ తతీయ బహుమతి ఎం.సాయిచరణ్, యు.శ్రీహర్ష, కథలు చదవడంలో ప్రథమ బహుమతి పి. గమాన్‌కృష్ణ, కథలు చెప్పడంలో ఎం.తేజశ్రీహర్ష విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు అందించారు. వచ్చిన అతిథుల ద్వారా బహుమతి ప్రధానం చేశారు.

మారేడుమిల్లి: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సుమారు 40 రోజులపాటు చిన్నారులకు లైబ్రరియన్ రమేష్ ఆధ్వర్యంలో మారేడుమిల్లి గ్రంథాలయ శాఖలో విజ్ఞాన తరగతులు జరిగాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సర్పంచ్ కొండా జాకబ్, జెడ్‌పిటిసి సభ్యులు గొర్లె బాలాజీబాబు, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. సర్పంచ్ కొండ జాకబ్ మాట్లాడుతూ సుమారు 40 రోజులు చిన్నారులకు గ్రంథాలయంలో అవగాహన కార్యక్రమాలు, చిత్రలేఖనం, ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలైన చిన్నారులకు బహుమతులు అందించారు.

కూనవరంలో...

ఘనంగా గిడ్డి ఈశ్వరి జన్మదిన వేడుకలు

ఈశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, తదితరులు

ప్రజాశక్తి- పాడేరు టౌన్: టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు తరలివచ్చారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోని కుమ్మరిపుట్టులో తన నివాసంలో శుక్రవారం టిడిపి నాయకులు గోవింద్ మాస్టారు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, అభిమానులు హాజరై ఈశ్వరి చేత కేక్ కట్ చేయించారు. ప్రజలు తనపై చూపిస్తున్న అభిమానానికి ఎల్లప్పుడు రుణపడి ఉంటానని ఈశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, డి.వెంకటరమణ (బుజ్జి), రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- మాడుగుల: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్థానిక శాసనసభ్యులు బండారి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. గురువారం మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో 20 ప్రముఖ కంపెనీలతో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ జాబ్ మేళాను బండారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ నాలుగేళ్లలో నిరుద్యోగ యువతీ యువకులు ఎవరూ లేకుండా చూడడమే చంద్రబాబు ముఖ్య లక్ష్మన్నారు. ఇంకా జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఇప్పటికైనా నిరుద్యోగ యువతీ యువకులు హాజరై ఉద్యోగ అవకాశాలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.అంతకముందు డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో స్థానిక నాయకులతో కలిపి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, తహసిల్దార్ కే రమాదేవి, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ సమైక్యతను కాపాడాలి

ప్రజాశక్తి-రోలుగుంట: పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ సమైక్యత వర్ధిల్లారి, ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలంటూ రోలుగుంటలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా భారతదేశ సమైక్యత వర్ధిల్లాలని, మతతత్వం నశించాలని, మతసామరస్యాన్ని కాపాడాలని, భారత లౌకిక రాజ్యాంగాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వరలక్ష్మి మాట్లాడుతూ, పెహల్గాం దాడి అనంతరం మన దేశ సైనికులు ఎంతో ధైర్య సాహసాలతో, పాక్ ఆక్రమిత ప్రాంతంలో ఉగ్రవాద స్థావరాలను మట్టుపెట్టి మన దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి సాటి చెప్పారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు, లౌకికవాదులు అండగా నిలిచారని కొనియాడారు. ఈ సమయంలో మత గొడవలు పెంచడం తగదని, మతసామరస్యాన్ని కాపాడాలన్నారు. దేశ సమైక్యతను, సార్వ భౌమాధికారాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఎండిఎం యూనియన్ జిల్లా అధ్యక్షులు కే.ప్రసన్న, అమ్మాజీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎంకే.పట్నం గ్రామంలో వైద్యాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఐదుగురు జ్వరగ్రస్తులకు రక్తపరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ, ఇంటి చుట్టూ మురుగు నీరు నిల్వలు ఉండరాదని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ నూకరాజు, పిహెచ్ఎన్ సత్యనారాయణమ్మ, హెచ్ఎవి సన్యాసమ్మ, ఏఎన్ఎం యశోద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువలో మొక్కల తొలగింపు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండలంలో చెట్టుపల్లి గ్రామంలో రావణపల్లి రిజర్వాయరుకు సంబంధించి మూలప్ప చెరువుకు వచ్చే పంటకాలువ మొక్కల తొలగింపు పనులు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం ఈ జంగిల్ పనులు చైర్మన్ రుత్తల రాజేశ్వరరావు వైస్ చైర్మన్ నాగులపల్లి గోవింద ఆధ్వర్యంలో టీడీపీ మండలపార్టీ ప్రెసిడెంట్ లాలం శ్రీరంగ స్వామిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అప్పి కొండ రాజారావు, కౌన్సిలర్ మురళి, కలిమి సత్తిబాబు, గజాల సూరిబాబు, మట్టా సతీష్, తోకల సత్తిబాబు, జిలానీ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో విచ్చల విడిగా కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని జనసేన చోడవరం నియోజకవర్గ ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు కోరారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, ఈ విషయమై పలుమార్లు ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ చర్యలు లేకపోవడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు .తాను కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా, ఒక నియోజకవర్గ స్థాయి ఇన్చార్జిగా పనిచేస్తున్న నాయకుడని చెప్పినా లెక్క లేకపోవడంలో అధికారుల ఉద్దేశ్యమేమిటో బయట పెట్టాలన్నారు.అధికారుల తీరు, ఇక్కడ జరుగుతున్న పరిస్థితులను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. మండలంలో కవగుంట, కోట్నాబిల్లీ వీరభద్ర, క్వారీలతో పాటు గుడ్డిప, తోటకూర పాలెం, గొంప, కొమిర, అర్జాపురం ,బుడ్డి బంద, గుమ్మళ్ళ పాడు, చీమల పాడు, అజయ్ పురంలో అనేక క్వారీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగిస్తున్నాయన్నారు. పగలు రాత్రి, అన్న తేడా లేకుండా, విపరీతంగా బ్లాస్టింగ్లు పేల్చడంతో క్వారీలకు సమీపంలో ఉన్న కవగుంట, కోట్నాబిల్లి తదితర గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతు న్నారన్నారు. వీటితో గృహాలు బీటలు బారుతున్నాయన్నారు. పంట పొలాల్లోకి క్వారీ ధూళి పడడంతో పొలాలు పూర్తిగా చౌడు భూములుగా తయారయ్యి పంటలు పండని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :నిబంధనలు ఉల్లంఘించి వేసవి సెలవలలో తరగతుల నిర్వహిస్తున్న ప్రయివేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మండల కేంద్రంలోని ప్రయివేటు పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గౌతం, జిల్లా కమిటీ సభ్యులు విజయ్‌లు మాట్లాడుతూ, నర్సీపట్నంలో ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు ఉల్లంఘించి పదోవ తరగతి విద్యార్థులకు క్లాసులు నిర్వహించటమే కాకుండా వారికి పరీక్షలు పెడుతున్నారన్నారు.

బోరు సామగ్రి అందిస్తున్న జమాల్‌ఖాన్

బోరు సామగ్రి వితరణ

ప్రజాశక్తి - మోతుగూడెం : చింతూరు మండలంలోని మోతుగూడెం లో తాగునీటికై గిరిజన కోందులు అవస్థలు పడుతున్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటి ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్‌ను కలిసి బోరు ఏర్పాటు చేయాలని కోరారు. జమాల్‌ఖాన్ స్పందించి బోరు తవ్వించారు. అనంతరం అవసరమైన సామగ్రి ఇనుప పైపులు, గొట్టాలు, హ్యాండిల్ తదితర 30 వేల రూపాయల విలువ చేసే బోర్ హ్యాండిల్ పరికరాలను శుక్రవారం తడికవాగు గ్రామస్తులకు అందజేశారు. జమాల్‌ఖాన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జైకెసిపి ట్రస్ట్ ఇంచార్జ్ ఎస్‌కె.రసూల్, వ్యవసాయ మార్కెట్ కమిటి సభ్యులు పసుపులేటి సాలమన్ రాజు, గ్రామ కార్యదర్శి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ తాగుతున్న పాదచారులు

మజ్జిగ పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి విజ్ఞాన కేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటి ఇన్‌చార్జి జి.ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం వరకూ ప్రతీ రోజూ నిర్వహిస్తామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా కంప్యూటర్ శిక్షణ, ప్రతీరోజూ ఉచిత వైద్యపరీక్షలు, నిర్వహిస్తున్నామని, మరికొద్ది రోజుల్లో టైలరింగ్ శిక్షణ కేంద్రం కూడా ప్రారంభిస్తున్నామని తెలిపారు. మజ్జిగ కేంద్రాన్ని లలితా కాలనీ సెక్రటరీ శారదాదేవి ప్రారంభించగా, మాజీ ఎన్ఎల్‌సి అధికారి గుప్తా, మహిళా కార్యకర్త సరోజిని సహకరించారు. కమిటి సభ్యులు బుజ్జి, సత్యనారాయణ, ఎం.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎస్‌సిపిసిఆర్ నోటిఫికేషన్‌లో విద్యార్హతలు సడలించండి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఈ నెల 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీ ఎస్సీపిసిఆర్) అధ్యక్ష, సభ్యుల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానించిందని, అయితే దీనిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హతగా సమాచారం ఉందని, వీటిని సడలించి గత నోటిఫికేషన్లు మాదిరి విద్యార్హతలతో నూతనంగా దరఖాస్తులు ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, ఫోరం న్యాయ సలహాదారు ఏ.ప్రవీణాత్రినాథ్ తెలిపారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రభుత్వానికి రాసిన లేఖ వివరాలు వెల్లడించారు. తమ ఫోరం విజ్ఞాపనను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి సత్వర చర్యలు చేపడుతుందన్న ఆశాభావంతో ఉన్నట్టు వారు తెలిపారు.

బడులు తెరిచే నాటికి కిట్లు అందేనా ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : ఈ నెల 12 నుంచి బడులు పున:ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ బడులు తెరిచేనాటికి పేద పిల్లలకు యూనిఫాం, బ్యాగ్, షూ, బెల్టు అందజేసే పరిస్థితి కనిపించడం లేదు. పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరినా మిగిలిన సామగ్రి రాలేదు. యూనిఫాం క్లాత్ ఇప్పటి వరకూ ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో సరఫరా చేసి కుట్టించుకొనే నాటికి ఆగస్టు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. విద్యార్థికి ఇచ్చే మూడు జతల యూనిఫాం క్లాత్‌కు కుట్టుకూలీ ప్రభుత్వం ఎంత ఇవ్వనుందనే స్పష్టతలేదు. జిల్లాకు ప్రతిపాదనల ప్రకారం 5.13 లక్షల పాఠ్యపుస్తకాలు, 6.9 లక్షల నోట్ పుస్తకాలు, 9,784 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 60,901 బెల్టులు విద్యార్థులకు వచ్చాయి. యూనిఫాం, బ్యాగులు, షూలు ఇంతవరకు ఏ ఒక్కటీ చేరలేదు. టెండర్లు పూర్తవడంతో పిల్లలకు సకాలంలో వాటిని అందిస్తామని అసెంబ్లీ సమావేశాల్లో విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటించారు. జిల్లాకు 96,807 బ్యాగులు,

జిల్లాకు చేరని యూనిఫాం, బ్యాగులు

96,642 షూలు, 96,807 మంది విద్యార్థులకు యూనిఫాం క్లాత్ ఇంకా రావాల్సివుంది. ఒక్కో విద్యార్థికి మూడు జతలు యూనిఫాం క్లాత్ ప్రభుత్వం అందజేయాల్సివుండగా, ఇంతవరకు మీటరు క్లాత్ కూడా జిల్లాకు చేరలేదు. పాఠశాలల పునరుద్ధరణ రోజు నుంచి విద్యార్థులందరికీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, డిక్షనరీలు మాత్రమే జిల్లాకు చేరాయి. మిగిలినవి చేరలేదు. జిల్లాకు చేరిన పాఠ్య, నోట్ పుస్తకాలు, బెల్టులు మండల కేంద్రానికి విద్యాశాఖ పంపిస్తోంది. యూనిఫాం క్లాత్ రంగు, బ్యాగు మార్చడంతో కొంత ఆలస్యం జరిగిందని, త్వరలో అవి కూడా వస్తాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : హెచ్ఎస్ఎల్ తన కాంట్రాక్ట్ కార్మికుల కోసం 2025 మే 28, 29, జూన్ 5,6 తేదీల్లో నైపుణ్య అప్‌గ్రేడేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో 450 మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులకు షిప్‌బిల్డింగ్ టెక్నాలజీ యొక్క కీలక సాంకేతిక రంగాలలో శిక్షణ అందించారు. కార్మికులకు మరింత నైపుణ్యం పెంపొందించేందుకు, మెలకువలు తెలుసుకునేందుకు భారత ప్రభుత్వ స్కిల్ ఇండియా మిషన్‌తో కలిసి, హెచ్ఎస్ఎల్ ఏడాది పొడవునా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

20న తపాలా అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని వినియోగదారుల వ్యక్తిగత సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 20న 118 వ తపాలా అదాలత్ నిర్వహిస్తామని విశాఖపట్నం రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం ఎంవిపి కాలనీలో పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో అదాలత్ జరుగుతుందని తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించి ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులను మాత్రమే ఈ అదాలత్‌లో చర్చిస్తామని తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు ఈ అదాలత్‌కు హాజరు కావచ్చునని తెలిపారు. అదాలత్‌కు హాజరయ్యేవారు తమ సమస్యలను ఈ నెల 16 లోగా 118వ తపాలా అదాలత్ అన్న శీర్షికతో, విశాఖపట్నం ఎంవిపి కాలనీలోని తమ కార్యాలయానికి దరఖాస్తు పంపించాలని ఆయన సూచించారు. గడువు దాటిన తరువాత వచ్చే దరఖాస్తులు స్వీకరించమని ఆయన స్పష్టం చేశారు.

ప్రశాంతంగా డిఎస్‌సి పరీక్ష ప్రారంభం

88.39 శాతం మంది హాజరు

పరీక్షా కేంద్రం వద్దకు హాజరైన అభ్యర్థులు

పరీక్షా కేంద్రానికి వస్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఆరిలోవ, ఆనందపురం విలేకరులు

ఉపాధ్యాయ నియామక పరీక్ష (మెగా డిఎస్‌సి) - 2025 శుక్రవారం విశాఖలో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైంది. జిల్లాలో ఉదయం 7 కేంద్రాల్లోనూ, మధ్యాహ్నం 4 కేంద్రాల్లోనూ జరిగిన పరీక్షకు 2,447 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 2,163 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 88.39 హాజరు శాతం నమోదైంది. డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక పరీక్షా కేంద్రాన్ని, ఫ్లైయింగ్ స్క్వాడ్ మూడు కేంద్రాలను సందర్శించారు. 90 నిమిషాల ముందు నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఈ నెల 30వరకు పరీక్షలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి కాలేజీలో నిర్వహించిన పరీక్షకు ఉదయం 200 మంది హాజరుకావాల్సి ఉండగా 171 మంది, మధ్యాహ్నం 200 మందికిగాను 184 మంది హాజరయ్యారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్-3,5,8 పరిధిలో జూన్7 న తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జివిఎంసి ఇన్‌చార్జి ప్రధాన ఇంజనీర్ కె. వి.ఎన్.రవి శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. జివిఎంసి రైవాడ తాగునీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టి.ఎస్.ఆర్‌కు వచ్చు తాగునీటి సరఫరా జరిగే ప్రధాన పి.డబ్ల్యూ.డి పంపుహౌస్‌లో 11 కెవి/ 33 కెవి విద్యుత్ మరమ్మత్తులు జరుగు నిమిత్తం జూన్ 7వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు తాగునీటి సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. జోన్-3లో డాక్టర్స్ కాలనీ, ఎం.ఎం.టి.సి కాలనీ, ఎ.పి.ఎస్.ఇ.బి కాలనీ, అంబేద్కర్ నగర్, పిఅండ్‌టి కాలనీ, గాంధీనగర్ ఏరియా, రామకృష్ణానగర్, శంకరమఠం మెయిన్‌రోడ్డు, చాకలిపేట, లలితనగర్, చైతన్యనగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, ఎన్. హెచ్-16 రోడ్డు, కళ్ళైన్ లైన్ ఏరియాస్, ఇందిరాగాంధీబొమ్మ లైన్, 80 అడుగుల రోడ్డు మొదలైన ప్రాంతాలు. జోన్-5 లో లక్ష్మీ నారాయణపురం-1,2, లెపర్స్ కాలనీ, కస్తూరినగర్-1, శాంతినగర్-1,2, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జై ప్రకాష్ నగర్, మహాత్మాగాంధీనగర్, ఇందిరానగర్ 2 నుండి 5, బాపూజీనగర్, పెద్దకొత్తూరు, అరుంధతినగర్, రాంజీ ఎస్టేట్, మాధవధార, మాధవధారవుడా లేఅవుట్, మర్రిపాలెం, మర్రిపాలెం వుడాలేఅవుట్, ఎన్.జి.జి.స కాలనీ, కంచరపాలెం, కరాసా, గ్రీన్‌గార్డెన్స్ శివనగర్, జ్యోతినగర్, పార్వతినగర్, శాంతినగర్, తుమ్మడిపాలెం, హుస్సేన్ నగర్, ఆర్.పి.పేట. జోన్-8లో లక్ష్మినగర్-ఎఫ్ బ్లాక్ పార్టు, సి.డి.బ్లాక్ పార్టు, శ్రీనివాసనగర్, ఆర్.ఆర్.వి.పురం రజకకాలనీ మొదలైన ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలుగు తుందన్నారు. ప్రజలు సహకరించాల్సిందిగా జివిఎంసి ఇన్‌చార్జి ప్రధాన ఇంజనీర్ కె.వి.ఎన్.రవి తెలియజేశారు.

చంద్రబాబు చొరవతో ఉత్తరాంధ్రకు మహర్దశ

- టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రైల్వేజోన్ విశాఖకే మణిహారం అని, ఇందువల్ల యువతకి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్‌గా సందీప్ మధుర్ నియమించారని ఈ దక్షిణ కోస్తా రైల్వేజోన్ రావడం వల్ల మన రాష్ట్ర యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ధన్య వాదాలు తెలిపారు. విశాఖలో ఒక రీజినల్ రింగ్ వస్తుందన్నారు. రాంబిల్లిబి కొత్తవలస ప్రాంతాలను కలుపుతూ ఈ రింగ్‌రోడ్ వెళ్తుందన్నారు.

మూడేళ్ల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు...

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మూడేళ్లగా మానసిక రోగంతో కుటుంబ సభ్యులకు దూరమైన వ్యక్తి ఎయుటిడి కృషి ఫలితంగా, శుక్రవారం కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు అందజేసిన సమాచారం ప్రకారం బీహార్‌లోని దర్భంగ జిల్లా సిసవునా గ్రామానికి చెందిన రాంబిహారి (35) అనే వ్యక్తి మూడు సంవత్సరాల క్రితం ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదిలిపెట్టి లూధియానా వెళ్లిపోయాడు. అక్కడ బిచ్చగాడుతో సహవాసం చేయడంతో నల్లమందుకి అలవాటు పడి మానసిక ఆరోగ్యం దెబ్బతింది. 2024 నవంబర్‌లో రైల్వేస్టేషన్‌లో ఎయుటిడి సిబ్బంది చేసిన రెస్క్యూ ఆపరేషన్లో పట్టుబడ్డాడు. జివియంసి షెల్టరుకు తరలించి, శ్రద్ధా వారు ఇచ్చిన మందులు వాడడంతో సాధారణ స్థితికి వచ్చాడు. దీంతో ఆయన స్వగ్రామంలో తల్లి కౌశల్య ముఖియా, సోదరుడు రాజ్‌కుమార్ ముఖియాకు క్షేమంగా అప్పగించినట్టు తెలిపారు.

భారీగా తగ్గిన గెలాక్సీ ఎస్ 25 ధర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ తమ ప్రతిష్టాత్మక గెలాక్సీ ఎస్25 అల్ట్రాపై అద్భుతమైన పరిమిత-కాల ఆఫర్‌ను ప్రకటించడం జరిగిందని, సామ్‌సంగ్ మొబైల్ విభాగ హెడ్ శ్రీని థార్ తెలిపారు. డాబా గార్డెన్స్‌లోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మొదట్లో రూ.1,29,999 ప్రారంభ ధరతో లభించిన గెలాక్సీ ఎస్ 25 అల్ట్రా ఇప్పుడు కేవలం రూ.1,17,999 వద్ద అందుబాటులో ఉంటుంద న్నారు. గెలాక్సీ ఎస్ 25 అల్ట్రాపై ప్రత్యేక ధర వద్ద రూ.12 వేలు తక్షణ క్యాష్‌బ్యాక్ కూడా కలిసి ఉంటుందని తెలిపారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో 5-15 ఏళ్ల వయసు గల బాలల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరి చేసేందుకు స్కూల్స్, కాలేజీలు, సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేకక్యాంపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జూన్ 10 నుంచి 13వరకు, జూన్ 24 నుంచి 27 వరకు క్యాంపులు నిర్వహిస్తారు.